## క్లుప్తంగా

### కార్యవర్గం.. ఏకగ్రీవం

వీపనగండ్ల: మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. 250 మంది ఉన్న సంఘ సభ్యులు ఉన్న ఈ సహకార సంఘానికి 9 మంది డైరెక్టర్లను ఎన్నుకోగా శుక్రవారం అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా ఎస్ వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా ఎస్ వెంకటయ్య, కోశాధికారిగా సీహెచ్ సాయిబాబాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జిల్లా అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీనివాసులు తెలిపారు.

### 'నీట్'లో ప్రతిభ చూపిన విద్యార్థినికి సన్మానం



పెబ్బేర్‌రూరల్: వనపర్తి మండలంలోని అప్పాయిపల్లికి చెందిన న్యాయవాది మాధవరావు కుమార్తె ప్రణతిసిందే నీట్ యూజీలో ప్రతిభ చూపి ఎంబీబీఎస్ సీటు సాధించడంపై అఖిలపక్ష ఐక్యవేదిక నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు సాధిస్తూ పట్టణానికి, జిల్లాకు పేరు తెస్తున్నారని వారిని ప్రోత్సహిస్తూ అఖిలపక్ష ఐక్యవేదిక పలుమార్లు సన్మానం చేసినట్లు గుర్తుచేశారు. విద్యలో ప్రతిభ చూపుతున్న విద్యార్థులను ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రోత్సహించడంలో ముందుంటుందన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్‌యాదవ్, సీపీఐ జిల్లా నాయకులు రమేష్, గోపాలకృష్ణ, టీడీపీ రాష్ట్ర నాయకులు కొత్త గొల్ల శంకర్, నాయకులు శివకుమార్, ఆనంద్, బొడ్డుపల్లి సతీష్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

### దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్‌నకి చెందిన క్యాసాని నాగరాజుపై దాడి చేసిన ఘటనలో నలుగురిపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 4న చెరువు వద్దకు వెళ్లిన నాగరాజుపై పల్లె మల్లేష్, పర్వతాలు, తిరుపతి, రాజు దాడిచేసి గాయపర్చారని తెలిపారు. సమాచారం అందుకున్న బాధితుడి భార్య విజయలక్ష్మి, కుమారుడు కలిసి చెరువు వద్ద వెళ్లారని.. గాయపడిన నాగరాజును హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించి చికిత్స చేయిస్తున్నారని వివరించారు. విజయలక్ష్మి శుక్రవారం ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### సమాధుల మట్టి తరలిస్తున్నారని ఫిర్యాదు



బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని ఆవంచలో సమాధుల మట్టి తరలిస్తున్నారని గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులు శుక్రవారం తహసీల్దారు జేకే మోహన్‌కు ఫిర్యాదు చేశారు. మట్టిని తవ్విన ప్రాంతంలో సమధి చేసిన పూర్వీకుల ఎముకలు బయటపడుతున్నాయని వివరించారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న మారేపల్లి గ్రామానికి చెందిన బొర్ర రాజశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘం నాయకులు జంగయ్య, శ్రీశైలం కోరారు.

### భూ పోరాటాలకు సిద్ధమవుదాం

కొల్లాపూర్ రూరల్: భూ పోరాటాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని సింగోటంలో నిర్వహిస్తున్న జిల్లా సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులకు మూడోరోజు ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రాష్ట్రంలో గుడిసెలు వేసుకున్న ప్రతి ఒక్కరికి ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములపై గుడిసెలు వేసిన వారిపై కేసులు ఎత్తేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

### ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు

మహమ్మదాబాద్: మండల పరిధిలోని గాధిర్యాల్ వీరాంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు చేపట్టారు. హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడంతో గ్రామస్తులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కార్యక్రమం చేపట్టారు. రూ. 2లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొన్న అన్నదాతలకు, గ్రామ యువకులను శాలువాలతో సన్మానం చేశారు. వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యాయులు గోపాల్, హనుమయ్య, రాంచందర్, లక్ష్మీకాంత్‌రెడ్డి, శంకరయ్య, అంజిలయ్య, హనుమయ్య, వెంకట్రాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లితండాలో..



మదనాపురం మండలంలోని దుప్పల్లిలో..



పెబ్బేరు మండలంలోని సూగూర్‌లో..

# ప్రభుత్వ బడుల్లో ప్రైవేట్‌కు దీటుగా బోధన

ఆత్మకూర్: ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్యతో పాటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు సమకూర్చుతున్నామని ఎంఈఓ భాస్కర్‌సింగ్, సీఆర్పీ సౌమ్యరాణి అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా బడి బయటి విద్యార్థుల వివరాలను నమోదు చేపట్టారు.

అమరచింత: బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని ఎంఈఓ భాస్కర్ సింగ్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం బలరాముడు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి పాఠశాలకు పంపాలని కోరుతూ కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం కరుణాకర్, సీఆర్పీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు తప్పకుండా బడిలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు గోపాల్ కోరారు. అప్పరాల జెడ్పీహెచ్‌లో ఉపాధ్యాయులతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా బుక్స్, యూనిఫాం ఇవ్వడంతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మన్ మమత, ఉపాధ్యాయ బృందం దేవన్న, ఆకుల వెంకటయ్య, మహేశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అరుణ, సురేఖ, రాజేందర్ తదితరులు ఉన్నారు.



అమరచింత బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు

పాన్‌గల్: ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా వసతులు కల్పిస్తున్నట్లు కేతేపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం రవికుమార్ అన్నారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లితండా పరిధిలో బడిబాట ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న బోధన, సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చదివించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వెంకటేష్, లక్ష్మణ్‌యాదవ్, బిచ్యానాయక్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెబ్బేర్‌రూరల్: ప్రభుత్వ బడుల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నారని ఏఏపీసీ చైర్‌పర్సన్ విజయమ్మ అన్నారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని శ్రీరంగాపూర్‌లో బడిబాట ర్యాలీ, ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

**దుప్పల్లిలో..**

మదనాపురం: మండలంలోని దుప్పల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మూలే ఆంజనేయులు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు పాఠశాలలో చేర్పించాలనీ తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సుధామణి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలరాజ్, ఉపాధ్యాయులు రాజు, లక్ష్మి, మహేంద్ర, మణి, మల్లయ్య, పాండురంగ, నిరంజన్‌గౌడ్, ఆంజనేయులు, స్వాతి, అంగన్‌వాడీ టీచర్ తారమ్మ తదితరులు పాల్గొన్నారు.



పాన్‌గల్ మండలంలోని కేతేపల్లిలో..



కొత్తకోట మండలంలోని అప్పరాలలో..



పెబ్బేరు మండలంలోని రంగాపూర్‌లో..

### నేటి నుంచి ఉర్సు

పెబ్బేర్‌రూరల్: మండలంలోని సూగూరులో శనివారం నుంచి మూడు రోజుల పాటు హజరత్ సయ్యద్‌షా ఫకీరుల్లా షా ఖాద్రీ ఉర్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాల్లో మొదటి రోజు 8న గంధం, రెండో రోజు 9న దీపారాధన, మూడో రోజు 10న ఫాతేహాతో ఉత్సవాలు ముగిస్తాయని వారు పేర్కొన్నారు. భక్తులందరికీ అన్న ప్రసాదం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

### గాలొచ్చినా.. వానొచ్చినా కరెంట్ కట్



అమరచింత: గాలొచ్చినా.. వానొచ్చినా కరెంటు కష్టాలు తప్పడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి వర్షం కురుస్తుండటంతో ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడినా సమస్యను పరిష్కరించే అధికారులు కరువయ్యారు. అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్న విద్యుత్ అంతరాయాలు తప్పడం లేదని పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎంతటి ఈదురు గాలులతో కూడిన వర్షాలు వచ్చినా కరెంట్ సరఫరా నిలిపేసేవారు కాదని, ప్రస్తుతం చీటికి మాటికి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్న పరిస్థితులు దాపరించాయని విద్యుత్ వినియోగ దారులు వాపోతున్నారు. స్థానికంగా ట్రాన్స్‌కో లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్లు లేక పోవడంతో సమస్యను ఎవరికి చెప్పాలో తెలియడం లేదన్నారు. అధికారులు స్పందించి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## క్షయ నివారణపై అవగాహన

పాన్‌గల్: మండలంలోని అన్నారం, కేతేపల్లి, మాందాపూర్ గ్రామాల్లో క్షయ వ్యాధి నివారణపై వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, రాత్రి వేళల్లో జ్వరం, స్వల్ప కాలంలో బరువు తగ్గడం, రాత్రి వేళల్లో చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్న వారు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకొని వ్యాధి నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. దీంతో పాటు బలవర్ధకమైన ఆహారం కోసం వ్యాధి నిర్ధారణ అయిన వారికి మందులు వాడినన్ని రోజులు ప్రతి నెల రూ.500 చెల్లిస్తారని తెలిపారు. టీబీ వ్యాధి ఉన్న వారు మద్యం, పొగ తాగడం మానేయాలన్నారు. ఆయా గ్రామాల్లో సర్వే చేసి అనుమానితుల నుంచి తెమడ పరీక్షల నిమిత్తం కళ్లెను సేకరించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ మైథిలి, వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్, శ్రీలక్ష్మి, రేవతి, ఆశా కార్యకర్తలు కవిత, చిన్నమ్మ, ప్రమీల, భాగ్యమ్మ, సువర్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



అన్నారంలో క్షయ నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

## విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి

ఖిల్లాఘనపురం: రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి మల్లయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని సోళీపురంలో మండల విత్తన టాస్క్‌ఫోర్స్ టీం ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. మండల వ్యవసాయ అధికారితో పాటు రెవెన్యూ శాఖ నుంచి డిప్యూటీ తహసీల్దార్ పరమేశ్వర్, పోలీస్ శాఖ నుంచి హెడ్‌కానిస్టేబుల్ మునిస్వామి టీంగా వెళ్లి శ్రీగురుదత్త, శ్రీగురునర్సింహ ట్రేడర్స్, ఖిల్లాఘనపురంలో శివశంకర్, శ్రీబాలాజీ ట్రేడర్స్ తదితర దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. విత్తనాలకు సంబంధించిన రికార్డుల్లోని వివరాలు, దుకాణాల్లో ఉన్న స్టాక్‌ను సరిచూశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రైతులు నకిలీ విత్తనాలు కొని మోసపోకుండా ఉండేందుకు అన్ని దుకాణాల్లో తరుచుగా తనిఖీలు నిర్వహించేందుకు ఈ నెల 1 నుంచి 10వ తేదీ వరకు ప్రత్యేకంగా వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, కొనుగోలు చేసిన వెంటనే రసీదును తీసుకుని భద్రపర్చుకోవాలన్నారు.



ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న ఏఓ మల్లయ్య తదితరులు

### 11.4 మి.మీ వర్షపాతం

కొల్లాపూర్: పట్టణంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు వర్షం కురిసింది. 11.4 మి.మీ వర్షపాతం నమోదైందని అధికారులు పేర్కొన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా చెరువుల్లోకి వర్షపు నీరు అధిక మోతాదులో చేరుకుంది. వాగులు ప్రవహించాయి. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు నిలిచి రోడ్లు బురదమయంగా మారాయి.

### పాన్‌గల్‌లో భారీ వర్షం

పాన్‌గల్: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈనెలలో ఇప్పటి వరకు కురిసిన వర్షాల్లో ఇదే భారీ వర్షం. దీంతో రోడ్లన్నీ జలమయంగా మారాయి. గంట పాటు కురిసిన వర్షానికి పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న రోడ్డుపై వర్షపు నీరు, గుట్టపై నుంచి వచ్చే వరదతో నీరు అధికమై స్టేషన్ ఆవరణలోకి వర్షపు నీరు చేరింది. మండల కేంద్రంతో పాటు అన్నారం, గోప్లాపూర్ గ్రామాల్లో కూడా భారీ వర్షం కురవడంతో చెరువులు, కుంటలకు వరద నీరు చేరింది. సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

### బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

ఎర్రవల్లి చౌరస్తా: జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా.. మానవపాడు మండలంలోని జల్లాపురం చెందిన చిన్నారెడ్డి స్వగ్రామం నుంచి తన బైక్‌పై పని నిమిత్తం పెబ్బేరు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో 44వ జాతీయ రహదారిపై బీచుపల్లి విజయ ఆయిల్ సమీపంలో బైక్ అదుపుతప్పడంతో ఆయన ఒక్కసారిగా నడి రోడ్డుపై పడిపోయాడు. అదే దారిలో వెళ్తున్న లారీ అతని రెండు కాళ్లపై వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## ఇంకుడుగుంతల నిర్మాణంపై దృష్టి



పాన్‌గల్‌లో కాల్వలో చెత్త, చెదారం, జమ్ము తొలగిస్తున్న ఉపాధి కూలీలు



సింగంపేటలో పాటు కాల్వ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

అమరచింత: వర్షాకాలంలో వర్షపు నీరు నేరుగా భూమిలోకి ఇంకేలా ప్రతి గ్రామంలో ఇంకుడుగుంతలను నిర్మించాలని, ఇందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని సింగంపేటలో జరుగుతున్న పాటు కాల్వలో పూడిక తీత పనులను పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల వద్ద ఇంకుడుగుంతల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో పెద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకొనేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని కోరారు. వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ప్రజలు జ్వరాల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీఓ నరసింహులు, ఈసీ రఘు పాల్గొన్నారు.

**మురికి కూపంగా..**

పాన్‌గల్: మండల కేంద్రంలోని వైన్ షాపు సమీపంలో ఉన్న మురుగు కాల్వలో చెత్త, చెదారం చేరడంతో జమ్ము మొలిచి దుర్వాసన వెదజల్లుతుందని, వాటి తొలగించి కాల్వను శుభ్రం చేశామని ఉపాధి కూలీలు పేర్కొన్నారు. గ్రామం నుంచి వచ్చే మురుగు, వర్షపు పాటు నీరు మొత్తం ఇదే కాల్వ గుండా ప్రవహించాలి. దీంతో ఈ కాల్వలో పేరుకపోయిన చెత్త, చెదారం, జమ్ముతో విపరీతమైన దుర్వాసన వెదజల్లుతుందని కాల్వ పరిసరాలల్లోని గృహ యజమానులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకవెళ్లారు. అయినా పారిశుధ్య కార్మికులు కాల్వలను శుభ్రం చేయకపోవడంతో దానిలో ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్త, చెదారం నిండిపోయింది. దీంతో తప్పని పరిస్థితుల్లో ఉపాధి కూలీలను పెట్టి ఆ కాల్వను శుభ్రం చేయించారు. దుర్వాసన వస్తున్న కాల్వను శుభ్రం చేసిన ఉపాధి కూలీలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ఆత్మకూర్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలను తీసుకొని రోగాలను తరిమేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రిరవికుమార్, కమిషనర్ నాగరాజు అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా రెండో వార్డులో సిబ్బందితో కలిసి ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. వర్షాల కారణంగా నివాసాల పరిసరాల్లో వర్షపు నీరు చేరి దోమలు వ్యాప్తి చెందే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రమ్ములు, హౌసులు తదితర వాటిల్లో నీరు నిల్వ ఉంచకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.





ఆత్మకూర్‌లో పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొన్న చైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ నాగరాజు

అమరచింత: పర్యావరణ సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అప్పుడే మనకు స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందని డాక్టర్ రూపశ్రీ అన్నారు. ప్రపంచ పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి ఆవరణంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా డాక్టర్ రూపశ్రీ మాట్లాడుతూ జీవ మనుగడ కేవలం మొక్కల సంరక్షణపైనే ఆధారపడి ఉందనే విషయాన్ని ప్రజలు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతి ఇంటి ముందు మొక్కలను నాటి అవి ఏపుగా పెరిగే విధంగా నిత్యం నీరు అందిస్తూ కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రోహేల, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, అవసరమైన పాఠశాలల వద్ద ఇంకుడు గుంతలు తవ్వాలని ఎంపీడీఓ వెంకటాచారి సూచించారు. శుక్రవారం మండలంలోని ఆగారం ప్రభుత్వ పాఠశాలను, అక్కడ ఏర్పాటు చేసిన ఇంకుడుగుంత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలను గుర్తించాలని ఆదేశించారు. బడి ఈడు బాల బాలికలు ఎవరైన బడికి రాకుండా పనులకు వెళ్తున్నట్లు ఉంటే వెంటనే వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలో 100 శాతం బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. అందుకు గ్రామ స్థాయిలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



అమరచింత ఆస్పత్రి ఆవరణలో..



ఆగారం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో..

## సమస్యలు పరిష్కరించాలని వినతి

పెబ్బేరు రూరల్: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్వీపర్స్, సెక్యూరిటీ గార్డుల సమస్యలను పరిష్కరించాలంటూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సూపర్‌వైజర్ వేధింపులు ఆపాలని, మహిళలని చూడకుండా రహస్యంగా ఫొటోలు తీయడం, మాటలు రికార్డింగ్ చేసి బెదిరించడం చేస్తున్నారని, చీటికి మాటికి వేతనాలు కట్ చేస్తూ ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సూపర్‌వైజర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుని కొత్త సూపర్‌వైజర్‌ను నియమించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కనీస వేతనం రూ.10,700 ఇస్తున్నారని, పీఎఫ్, ఈఎస్‌ఐ కటింగ్ పోను రూ.9వేలు మాత్రమే వస్తున్నాయని, దీంతో కుటుంబాలు గడవడం కష్టంగా ఉందని వాపోయారు. పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా కన్వీనర్ పుట్ట ఆంజనేయులు, రాములు తదితరులు ఉన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

### తండాల్లో ఎక్సైజ్ దాడులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సున్నపుతండా, బోడబండ తండాలలో కొల్లాపూర్ ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకొన్నారు. 1000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగిరెడ్డి తెలిపారు. సారా తయారీదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌ఐ అరుణ, సిబ్బంది ఉన్నారు.